ఏటీసీలో 110 మందికి ప్రవేశాలు కల్పించాం: కలెక్టర్



విద్యార్థినికి ప్రవేశ పత్రం అందిస్తున్న మనుచౌదరి

కొండపాక గ్రామీణం, సిద్దిపేట టౌన్, ములుగు, న్యూస్‌టుడే: కుకునూరుపల్లిలోని ఐటీఐ ఆవరణలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ఇప్పటివరకు 110 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామని కలెక్టర్ మనుచౌదరి వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సైతం కల్పించామన్నారు. ఏటీసీ ప్రవేశాల తీరుతెన్నులపై ఉపాధి కల్పన, శిక్షణ, ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణఆదిత్య హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఐటీఐ ప్రిన్సిపాళ్లతో దృశ్యసమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో కుకునూరుపల్లిలో ఏటీసీ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని గుత్తేదారు, ప్రిన్సిపల్ వెంకటరమణకు చెప్పారు. విద్యార్థులకు ప్రవేశ పత్రాలను కలెక్టర్ అందజేశారు. పీఎం విశ్వకర్మ పథకంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు చేసిన చెక్క బొమ్మలను తిలకించారు.

- మర్కూక్ మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ గృహ సముదాయం భవనాలను సీపీ అనూరాధ, అదనపు డీసీపీ మల్లారెడ్డి, సాంఘిక సంక్షేమ జోనల్ అధికారి ప్రత్యూష ఆయా శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. దుద్దెడలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను మర్కూక్ బ్యారక్‌లోకి మార్చాలని నిర్ణయించామన్నారు. మర్కూక్ రాణాను, కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని వారు సందర్శించి మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మల్లన్న సాగర్ భూనిర్వాసితుడు శివకుమార్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో బన్సీలాల్, డీఆర్డీవో జయదేవ్‌ఆర్య, జిలా ఉపాధికల్పన అధికారి రాఘవేందర్, సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఏసీపీ పురుషోత్తం, సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తరించిన సుడా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సిద్దిపేట, న్యూస్‌టుడే: సుడా (సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ని జిల్లా అంతటికి విస్తరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల పురపాలికలు సహా జిల్లాలోని 286 గ్రామాలు ఆ పరిధిలోకి చేరాయి. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ - అర్బన్ డెవలప్‌మెంట్ జారీ చేసింది. పట్టణాల చుట్టూ ఉన్న గ్రామాలను మౌలిక సదుపాయాలతో సమగ్రంగా, ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి ఇటీవల ప్రతిపాదనలు పంపించగా.. ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం సుడా పరిధిలో సిద్దిపేట సహా సమీపంలోని 26 గ్రామాలు కొనసాగుతున్నాయి. తాజా ఉత్తర్వులతో హెచ్ఎండీఏ పరిధిలోని మర్కూక్, ములుగు, వర్గల్ మినహా 23 మండలాలు సిద్దిపేట పట్టాణాభివృద్ధి సంస్థ జాబితాలో చేరాయి.

పదేళ్లలో కానివి నెల రోజుల్లో చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం



మాట్లాడుతున్న ప్రీతం, చిత్రంలో నర్సారెడ్డి, నాయకులు

గజ్వేల్, న్యూస్‌టుడే: రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని పరిపాలించిన కేసీఆర్ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని.. ఆయనకు దళితులపై చిత్తశుద్ధి లేదనటానికి గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి అద్దం పడుతోందని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నగరి ప్రీతం అన్నారు. గజ్వేల్‌లోని ప్రభుత్వ గురుకుల పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రాత్రి బస చేశారు. 2002-05లో ఇదే కళాశాలలో ప్రీతం విద్యాభ్యాసం చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడారు. గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్.. పైన పటారం లోన లొటారంలా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన.. ప్రమాద స్థలాల గుర్తింపు

కొండపాక గ్రామీణం, గజ్వేల్ గ్రామీణ, సిద్దిపేట టౌన్: జిల్లాలోని రాజీవ్ రహదారిపై దుద్దెడ టోల్ ప్లాజా నుంచి వంటిమామిడి చౌరస్తా వరకు 30 ప్రమాద స్థలాలను గుర్తించినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ప్రమాదాల నివారణలో భాగంగా తొగుట సీఐ లతీఫ్, ట్రాఫిక్ సీఐ మురళి, హెచ్‌కేఆర్‌బీజీఎం విజయభాస్కర్, ఇతర శాఖలకు చెందిన అధికారులతో కలిసి శుక్రవారం రహదారిపై ప్రమాద స్థలాలను గుర్తించామన్నారు. ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. నర్సాపూర్ చౌరస్తా నుంచి రంగీలా దాబా వరకు ఇరువైపులా చెట్ల పొదలను కూలీలతో ట్రిమ్మింగ్ చేయించారు.

సర్వేలతో ముందడుగు

- 365బి జాతీయ రహదారి నిర్మాణంతో జిల్లాలో కొత్త రూపు
- రూ.1100 కోట్ల పనుల ప్రతిపాదనలకు అనుమతి

న్యూస్‌టుడే, చేర్యాల, సిద్దిపేట:

జాతీయరహదారులతో ప్రధానంగా దూరప్రాంతాలకు రవాణా వ్యవస్థ మెరుగవుతుంది. తద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను కొత్తగా ప్రతిపాదించడం లేదా ఉన్నవాటి పొడవును విస్తరించడం చేస్తోంది. ఈ క్రమంలోనే ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం సూర్యాపేట- సిరిసిల్ల పట్టణాల మధ్య 184 కిలోమీటర్ల రోడ్డును '365బీ' సంఖ్యతో జాతీయ రహదారిగా ప్రకటించింది. అప్పటి నుంచి విడతల వారీగా ఈ రహదారి విస్తరణ పనులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి నిధులు విడుదలైతే వేగం పుంజుకోనున్నాయి. ప్రధానంగా భూసేకరణ సమస్య కొలిక్కి వస్తే ముందడుగు పడనుంది. ఇప్పటికే మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులు దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్ ప్రాంతాల్లో వేగంగా కొనసాగుతున్నాయి.

- జాతీయ రహదారి సంఖ్య: 365బీ
- మొత్తం దూరం: 184 కి.మీ.
- కొత్తగా మంజూరు: సిద్దిపేట జిల్లా దుద్దెడ-సిరిసిల్ల
- సర్వే చేస్తున్న దూరం: 36 కి.మీ.
- ఎన్ని వరుసలు: 4
- ప్రతిపాదన ఖర్చు: రూ.1,100 కోట్లు



సిద్దిపేట నుంచి సిరిసిల్ల వెళ్లే రహదారి కూడలి

గుర్తించిన 25 మలుపులు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మొదటి విడతలో సూర్యాపేట నుంచి జనగామ వరకు నాలుగు వరుసల రహదారిని నిర్మించారు. రెండో విడతగా జనగామ నుంచి చేర్యాల మీదుగా దుద్దెడ క్రాస్ రోడ్డు వరకు విస్తరణ పనులు సాగుతున్నాయి. రెండో విడతలో 46 కిలోమీటర్ల రహదారి. సుమారు రూ.400 కోట్లతో చేపట్టారు. ఇక మూడో విడతగా సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు 36 కిలోమీటర్ల రోడ్డును విస్తరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సిద్దిపేట-సిరిసిల్ల మధ్య 25 చోట్ల ప్రమాదకర మలుపులున్నట్లు గుర్తించిన అధికారులు అవి లేకుండా ప్రణాళిక (డీపీఆర్) సిద్ధం చేశారు. దీనికి రూ.1,100 కోట్ల అంచనాతో ప్రతిపాదించగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నిర్మాణం పూర్తయితే 365బీ జాతీయ రహదారి కొత్తరూపును సంతరించుకోనుంది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడ, కొమురవెల్లి దేవస్థానాలకు వెళ్లే భక్తులకు ఎంతో ప్రయోజనం కలుగనుంది.

సిద్దిపేటకు మరో బైపాస్!

ఈ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సిద్దిపేట పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలో పొందుపరిచారు. ఇప్పటికే కరీంనగర్ వైపు పొన్నాల నుంచి బైపాస్ రోడ్డు ఉంది. సిద్దిపేట పట్టణ పరిధిలోని రాజీవ్ రహదారిపై కాకుండా మరోవైపు బైపాస్ నిర్మించనున్నారు. దుద్దెడ, ఖమ్మంపల్లి, మర్పడ్గ, తడ్కపల్లి, ఎన్సాన్‌పల్లి, బూరుగుపల్లి, చిన్నగుండవెల్లి, పుల్లూరు, మల్యాల, గుర్రాలగొంది, జక్కాపూర్ తదితర గ్రామాల మీదుగా కొత్త రోడ్డు విస్తరించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు జాతీయ రహదారులు, విద్యుత్తు విభాగాలు క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాయి.

క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం

– డి.అన్నయ్య, డీఈఈ, జాతీయ రహదారుల శాఖ, సిద్దిపేట

సిద్దిపేట-సిరిసిల్ల జాతీయ రహదారి విస్తరణ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పలు విభాగాలు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నాయి. భూసేకరణ అనంతరం విస్తరణ పనులు మొదలవుతాయి.

అంధకారంలో హుస్నాబాద్



హుస్నాబాద్, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో తవ్వకాలు చేపట్టగా విద్యుత్తు కేబుళ్లు ధ్వంసమై హుస్నాబాద్ పట్టణంలోని కాలనీల్లో వీధి దీపాలు వెలగటం లేదు. సిద్దిపేట-హనుమకొండ ప్రధాన రహదారిలోని వ్యాపార ప్రాంతంలో పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. గుత్తేదారు, పర్యవేక్షిస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదు. అంబేడ్కర్ చౌరస్తా, బస్‌స్టేషన్, మల్లెచెట్టు ప్రాంతం, సిద్దిపేట రోడ్డు సంబంధిత ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటం లేదు. పట్టణంలో రాత్రిపూట ఈ రహదారులపై వాహనాల రాకపోకల తీవ్రమైన రద్దీ, షాపింగ్‌కు వచ్చే జనాలు చీకట్లో అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణ పరిధిలో జాతీయ రహదారి ఉన్న దాదాపు రెండు కి.మీ పొడవున ఉన్న సెంట్రల్ లైటింగ్ దీపాలు 180 వెలగక వెలవెలపోతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి కావడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు రాత్రిపూట చీకట్లో కొనసాగాల్సిందేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వీధి దీపాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని అసౌకర్యాన్ని తొలగిస్తామని పుర అధ్యక్షురాలు ఆకుల రజిత తెలిపారు.

- మున్సిపాలిటీలో వీధి దీపాలు 2850
- బటర్‌ఫ్లై 180
- వీధి దీపాలు బిగించాల్సిన కొత్త కాలనీల ప్రాంతాలు: కరీంనగర్ రోడ్, కోర్టు, ఏనె, ఎల్ఐసీ వెనుక, ఎస్టీ హాస్టల్.
- కొత్త కాలనీల్లో పాతిన స్తంభాలు 60

సభ్యులు రాకపోవడంతో వీగిన అవిశ్వాసం

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: అల్లీపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్ సదానందం, వైస్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డిపై ప్రకటించిన అవిశ్వాసం వీగిపోయింది. సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం తొలగిపోయినట్లు డీసీవో నాగేశ్వరరావు ప్రకటించారు. పీఏసీఎస్‌లో 13 మంది సభ్యులున్నారు. గత నెల 28న 8 మంది సభ్యులు అవిశ్వాసం పెట్టారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

కాలువ దిశ మార్చాలని వినతి

హుస్నాబాద్: గౌరవెల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే పంట కాలువకు సంబంధించి హుస్నాబాద్ పట్టణ పరిసరాల్లోని 13ఎల్ కాలువ దిశ మార్చాలని స్థానికులు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్ల మధ్య నుంచి 13 ఎల్ పంట కాలువ నిర్మాణానికి భూ సేకరణకు ప్రకటన జారీ చేశారని, ఇప్పటికీ డీ4 కాలువకు 14.2 నుంచి 17.5 మీటర్ల వరకు ఎలాంటి ఆయకట్టు లేదన్నారు. కాలువ వల్ల దాదాపు వంద కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో డీఏవోకు వినతిపత్రం ఇచ్చారు. జ్యోతికుమార్, తిరుపతి, రాంరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

క్షేత్ర పర్యటనలో 12 పురపాలికల అధికారులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో అమలవుతున్న ఆదర్శ అంశాలను ఒడిసిపట్టేందుకు రాష్ట్రంలోని 12 పురపాలికల అధికారులు రెండో రోజు శుక్రవారం పట్టణంలో పర్యటించారు. విశేషాలను కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు వివరించారు. 31వ వార్డులో చెత్త సేకరణ తీరును, వన మహోత్సవంలో నాటిన మొక్కలను చూశారు. బుస్సాపూర్‌లోని బయోగ్యాస్ ప్లాంటు, ఇర్కోడు వద్ద వధశాల, వాణిజ్య వ్యర్థాల కేంద్రాలను పరిశీలించారు. స్వచ్ఛబడిలో పాఠాలు విన్నారు. స్థానిక మున్సిపల్ ఉపాధ్యక్షుడు కనకరాజు, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి క్రీడా ఎంపిక పోటీలు

సిద్దిపేట టౌన్: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య వెల్లడించారు. ఈనెల 26న కోహెడ మండలంలోని నాగసముద్రాల తెలంగాణ గురుకుల కళాశాల మైదానంలో జూడో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-17 విభాగంలో బాలబాలికలు వేర్వేరుగా ఈ పోటీలుంటాయన్నారు. నవంబరు 2న ప్రజ్ఞాపూర్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నెట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన క్రీడాకారులు తమ నిజ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 9246666472, 9963996911 చరవాణి నంబర్లలో సంప్రదించాలన్నారు.



ఒడిదొడుకులు దాటి.. సివిల్స్ సాధించి..

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్

ఒకరిది పేద కుటుంబం.. మరొకరికి అత్యున్నత ఉద్యోగమే లక్ష్యం.. ఇలా తమ లక్ష్యాల సాధనకు ఎంతో శ్రమించారు. ఎన్నో అడ్డంకులను అధిగమించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి తాము అనుకున్నది సాధించారు. లక్షల మంది పోటీపడిన ఈ పరీక్షల్లో తామెంటో నిరూపించుకున్నారు. ఎన్నో ఒడుదొడుకులు దాటుకొని ఇక్కడి వరకు వచ్చారు. ప్రజాసేవే ధ్యేయంగా సివిల్ సర్వీసెస్ సాధించిన వారంతా పల్లెల బాట పట్టారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలు లబ్ధి పొందుతున్న తీరు, జీవనస్థితిగతులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం గ్రామాలకు వచ్చారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' వారిని పలకరించింది. ఆయా విశేషాలు వారి మాటల్లోనే ఇలా..

కిరాణా వ్యాపారి కుమారుణ్ని



మాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముండ్ గ్రామం. మధ్యతరగతి కుటుంబం. 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తండ్రి కిరాణా దుకాణం నిర్వహిస్తూ మమల్ని పోషించారు. తల్లి గృహిణి. నాన్నకు సహకారాలు అందించేది. ఇంట్లో కష్టాలను చిన్నప్పటి నుంచి చూశా. వాటిని అధిగమించాలంటే ఉన్నత స్థానానికి చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. సివిల్స్ సాధించడమే ధ్యేయంగా సన్నద్ధమయ్యా. రెండుసార్లు విఫలం కాగా, మూడోసారి ఉత్తమ ర్యాంకు సాధించగా ఐపీఎస్ వచ్చింది. కరోనా సమయంలో ఎంపికయ్యా. దీని కారణంగా క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాలేదు. అందులో భాగంగానే ఇప్పుడు ఇక్కడికి వచ్చా. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ఉద్యోగం చేస్తున్నా. చదువుకు కులమతాలు, ధనిక, పేద అన్న తేడా లేదు. కష్టపడితే ఏదైనా సాధ్యమే. యువతీ, యువకులు అందరూ గమ్యం నిర్దేశించుకుని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలి.

– ఆకాష్‌కుమార్ శుక్లా, ఐపీఎస్ అధికారి

సాఫ్ట్‌వేర్ కొలువు కాదనుకొని..



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూ. ఐఐటీ బొంబాయిలో బీటెక్ పూర్తి చేశా. చిన్నప్పటి నుంచి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు పడలేదు. బీటెక్ తర్వాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో అత్యున్నత జీతంతో ఉద్యోగం వచ్చింది. కొద్దిరోజులు ఉద్యోగం చేశాక, అది నచ్చలేదు. ప్రజలకు ఏదైనా సేవ చేయాలన్న తలంపుతో సివిల్ సర్వీస్‌ను ఎంచుకున్నా. ఇందులో ఉద్యోగమే లక్ష్యంగా అడుగేశా. శిక్షణ తీసుకున్నాం. రెండుసార్లు సివిల్స్ రాసి విఫలమయ్యా. అయినా కుంగిపోలేదు. కుటుంబ సభ్యులు సహకారం అందించారు. మూడోసారి విజయం వరించగా, ఐఈఎస్(ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనంలో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వం ఎంతో చేయాల్సి ఉంటుంది. అందులో సివిల్ సర్వీస్ అధికారులదే కీలక పాత్ర. నేటి యువత పోటీ పరీక్షల్లో ఉద్యోగం రాలేదని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా ముందుకు సాగితే విజయం ఖాయం.

– జాన్విపటేల్, లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్

నాన్న స్ఫూర్తిగా అడుగేశా..



నా స్వగ్రామం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ గృహిణి. చిన్నతనంలోనే సివిల్స్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఈ విషయంలో నాన్నే నాకు స్ఫూర్తి. ఆయన సూచనలతో ముందుకు సాగా. పోటీ పరీక్షల్లో రాణించేందుకు మెలకువలు నేర్చుకున్నా. రోజులో 16 గంటల పాటు చదివాను. సివిల్స్‌కు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్నా. దీని గురించి చరవాణిని సైతం కొన్నాళ్ల దూరంగా ఉంచా. అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించాను. 2023లో తొలిసారిగా పరీక్ష రాయగా ఉత్తీర్ణత సాధించా. ఐఈఎస్(ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) వచ్చింది. క్షేత్రస్థాయి పర్యటనలో పక్కాగా పథకాలు అమలు చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేయవచ్చని తెలుసుకున్నా.

– వైభవ్ రాథోడ్, శిక్షణ ఐఈఎస్ అధికారి

తెలంగాణ క్యాడర్‌లోనే..



మాది మహారాష్ట్ర. నాన్న కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆయన స్ఫూర్తితోనే పోలీసు శాఖలో చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. అందులోనూ ఐపీఎస్ సాధించాలని సంకల్పించుకున్నా. దీని గురించి అన్ని రకాలుగా తెలుసుకున్నా. ఎప్పటికప్పుడు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకున్నా. మొదటి సారి పరీక్ష రాయగా విఫలమయ్యాను. రెండోసారి విజయం సాధించా. అత్యుత్తమ ర్యాంకు రాగా, ఐపీఎస్‌కు ఎంపికయ్యా. ప్రస్తుతం తెలంగాణ క్యాడర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నా. క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాకపోవడంతో ఇప్పుడు ఇక్కడికి వచ్చా. నా తండ్రి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో కష్టపడి చదివా. రోజులో 16 గంటలు దీనికే కేటాయించా. ఆత్మవిశ్వాసంతో అడుగేస్తే విజయం ఖాయమని నా ఉద్దేశం.

– చేతన్‌నితిన్, ఐపీఎస్ అధికారి

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడమే ధ్యేయం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రోబోటిక్స్ విద్యతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడంతో పాటు సమస్యల పరిష్కార నైపుణ్యాలు మెరుగుపర్చడమే ప్రధాన ధ్యేయమని సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సహకారంతో రోబోటిక్స్ ఆన్ అకాడమిక్ (ఆర్ఐఏ) అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జశ్వంత్ మాట్లాడుతూ.. సైన్స్‌ను ఇష్టంగా అభ్యసించాలని, తద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 16 జిల్లాల్లోని 285 పాఠశాలల్లో 47,875 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇచ్చామని చెప్పారు. త్వరలో మరిన్ని చోట్ల ప్రారంభిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ.. రోబోటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. భౌతికశాస్త్రం విద్యార్థులు 80 మందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సింహారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్

ధనలక్ష్మిగా వాసవీమాత



దుబ్బాక పట్టణం వైశ్యభవన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. అమ్మవారిని రూ.11 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి మాతగా అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, దుబ్బాక

రోగుల నాడి పట్టి చూస్తున్నారా..!

నర్సాపూర్, కౌడిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ఉంటూ, వారి నాడి పట్టి పరీక్షించాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్పష్టంచేశారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషంట్ల విభాగం, ఓపీ నిర్వహణను పరిశీలించారు. వేచి ఉన్న రోగులతో మాట్లాడారు. వైద్యులు నాడి పట్టి చూస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ పావనికి సూచించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివదయాల్, వైద్యులు మిర్జాబేగ్, రాజేష్, వంశీ తదితరులు ఉన్నారు. అనంతరం కౌడిపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న సామాజిక ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఇక్కడి డిశ్చార్జ్ రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని స్పష్టంచేశారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యురాలు మహిమ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఉన్నారు.



నర్సాపూర్ ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర కమిషనర్ అజయ్ కుమార్

ఐఐటీహెచ్‌లో అంకుర సంస్థల సదస్సు

సంగారెడ్డి టౌన్, కంది, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులకు చేయూతే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీహెచ్‌లో శుక్రవారం స్టార్టప్, ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించారు. వీసీ సర్కిల్-ప్యూర్ ఈవీ అంకుర సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 60 అంకుర సంస్థలు, 130 మంది యువ పారిశ్రామికవేత్తలు, దేశ విదేశాలకు చెందిన 30 మంది పెట్టుబడిదారులు ఇందులో భాగస్వాములయ్యారు. అంకుర సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను పెట్టుబడిదారుల ముందుంచారు. ఆధునిక సాంకేతికత ఆలోచనతో రూపొందించిన ప్రాజెక్టులతో ముందుకు వచ్చే అంకుర సంస్థల్లో పెట్టుబడులకు పలువురు ఆసక్తి చూపారు. అంతకు ముందు 'భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహన విప్లవం-భవిష్యత్తు' అనే అంశంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని ఐఐటీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్యూర్ ఈవీ(ఎలక్ట్రికల్ వెహికిల్) వ్యవస్థాపక ఛైర్మన్ డా.నిషాంత్ దొంగరి ఆవిష్కరించారు.

ఇంట్లో చోరీ.. ముగ్గురు మహిళల అరెస్టు

కల్హేర్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన ముగ్గురు మహిళలను అరెస్టుచేసి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. ఈనెల 15న కల్హేర్‌కు చెందిన బత్తిని పద్మవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ విషయం పసిగట్టిన ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు చెగోళ్ల చంద్రకళ, మీసాల గంగవ్వ, అల్లాపూరం ఉమారాణిలు జతకలిసి అదేరోజు పద్మవ్వ ఇంటి తాళం పగులగొట్టి ఆభరణాలతోపాటు నగదు చోరీకి పాల్పడ్డారు. నిందితులు సొత్తును సమీపంలోని గ్రామంలో అమ్మకం చేయడంతో విషయం బయటకు వచ్చింది. కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితులు అమ్మిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు, 20 తులాల వెండి కడియాలు, పది తులాల పట్టగొలుసులతో పాటు రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

ఆహుతైన 9 వాహనాలు



కాలిపోయిన కార్లు

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని కారు షెడ్డులో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. నర్సాపూర్ చౌరస్తా సమీపంలో కారు మెకానిక్ షెడ్డు ఉంది. గురువారం రాత్రి ఎప్పటిలాగే షెడ్డుకు తాళం వేసి నిర్వాహకులు, కార్మికులు వెళ్లిపోయారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కార్లున్న షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అందులోని తొమ్మిది కార్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. షెడ్డులోని కార్లు కాలిపోయాయి. ప్రమాదం ఎలా జరిగిందనే విషయమై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోసపోయాం న్యాయం చేయండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మోమిన్‌పేట: మేము కొనుగోలు చేసిన స్థలాల్లో, పంటలు సాగు చేస్తున్నారని, మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు రెవెన్యూ అధికారులకు శుక్రవారం విన్నవించారు. అధికారులు, బాధితులు తెలిపిన ప్రకారం మండల పరిధి ఎన్కెపల్లి శివారు 86 సర్వే నంబరులో షేక్‌బద్రోద్దీన్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, ప్లాట్లుగా విక్రయించాడు. 34 మందికి వికారాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేశాడు. లేఅవుట్ లేని భూముల్లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన వారి ప్లాట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో బాధితులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటి స్థలాలు పరిశీలించేందుకు అధికారులు శుక్రవారం వస్తారని పంచాయతీ కార్యదర్శి పార్వతమ్మ దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా పత్రాలతో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లి చూడగా, ఆ భూమి చుట్టూ ప్రహరీ ఉండడంతో వారికి ఏంచేయాలో అర్థం కాలేదు. స్థలాలు చూపిస్తేనే ఎల్ఆర్ఎస్ చేసే వీలుంటుందని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఉప తహసీల్దార్ సురేష్‌కు వివరించి, వినతిపత్రం ఇచ్చారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 115–00		డ్రెస్డ్ 199–00
రిటైల్ 137–00		స్కిన్‌లెస్ 226–00

పిడుగు గుట్టు తెలిపేలా..

ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసినప్పుడు ఎక్కడో చోట పిడుగు పడిందని మనకు తెలుస్తుంటుంది. దాని కారణంగా మనుషులు సైతం మృతి చెందుతుంటారు. అత్యధికంగా అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండ ప్రాంతాల్లో ఇవి పడుతుంటాయి. పిడుగుపాటు ప్రమాదాన్ని ముందే గుర్తించేలా భారత వాతావరణ విభాగం, శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దామిని లైటెనింగ్ అలర్ట్ పేరిట దీన్ని రూపొందించింది. దీని ద్వారా మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందే తెలుసుకొని జాగ్రత్త పడొచ్చు.

హెచ్చరించేలా..

భారత వాతావరణ విభాగం (ఐఎండీ), శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీఎం పుణే రూపొందించిన దామిని లైటెనింగ్ అలర్ట్ (Damini lightning Alert) యాప్ ద్వారా ముందే పిడుగుపాటును తెలుసుకోవచ్చు. ముందుగా ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ లేదంటే యాపిల్ యాప్‌స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఫోన్‌లో జీపీఎస్ ఎనేబుల్ చేసి పేరు, మొబైల్ నంబరు, చిరునామా, పిన్‌కోడ్ వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మీరున్న ప్రాంతానికి 20-40 కి.మీ. పరిధిని ఒక సర్కిల్‌గా చూపిస్తుంది. అక్కడ పిడుగు పడుతుందా, లేదంటే ఎంత సేపట్లో పడుతుందనేది హెచ్చరిస్తుంది. ఆయా హెచ్చరికలను మూడు రంగుల్లో (ఎరుపు, పసుపు, నీలం) వ్యవధి సమయాన్ని సూచిస్తుంది.

- ఎరుపు ఉంటే 7 ని.లు, పసుపు ఉంటే 10-15 ని., నీలం ఉంటే 18-25 నిమిషాల్లో అక్కడ పిడుగు పడే వ్యవధిని సూచిస్తుంది.



యాప్‌లో వివరాలు

మేఘాలు ఢీకొని..

ఆకాశంలో వేగంగా కదిలే మేఘాలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ప్రసరణకు ఒక వాహకం అవసరం. భూమ్యాకర్షణతో పిడుగు రూపంలో నేలపైకి విద్యుత్తు ప్రసరిస్తుంది. దీని శక్తి సూర్యుడి ఉపరితల శక్తి కన్నా ఎన్నో రెట్లు ఎక్కువని పలు పరిశోధనల్లో తేలింది. మేఘాలు, భూమికి మధ్య ఉండే గాలి పిడుగును నేల వైపునకు చేరుస్తుంది. ఒక పిడుగుతో సుమారు 30 కోట్ల వోల్టుల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంచనా.

యాప్ రాడార్ ద్వారా సమాచారాన్ని సేకరించి జీపీఎస్ ద్వారా మనకు తెలియజేస్తుంది. తెలుగుతో పాటు 23 భాషల్లో సమాచారం అందిస్తుంది. మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్ నోటిఫికేషన్ వస్తుంది. తద్వారా అప్రమత్తం కావొచ్చు. పొలాల వద్ద పని చేసే రైతులు, పశుకాపరులు, ఆరు బయట పనిచేసే వారికి ఇదెంతో ఉపయోగకరం.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

రైతులకు ఉపాధినిచ్చే పనులకే ప్రాధాన్యం



వివరాలు ఆరా తీస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి కృష్ణమూర్తి

చేర్యాల (మద్దూరు), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద 2025-26 సంవత్సరానికిగాను రూపొందిస్తున్న ప్రణాళికలో రైతులకు ఉపాధితో పాటు ప్రజా ప్రయోజనం ఉన్న పనులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం రాష్ట్ర మేనేజరు కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు, ధర్మారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతేడాది చేపట్టిన పనులు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన ప్రణాళికలో పేర్కొన్న పనుల ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. అందరికీ ఉపయోగపడే వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. శతశాతం పూర్తిచేసేలా కార్యాచరణ ఉండాలని స్పష్టంచేశారు. జిల్లా ఏపీడీ శివాజీ, కోఆర్డినేటర్ (లైజన్ అధికారి) నూరుద్దీన్, ఎంపీడీవో రామ్మోహన్, ఏపీవో పరశురాములు, సాంకేతిక సహాయకులు దేవేందర్, శ్రీనివాస్, వెంకటమ్మ తదితరులున్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ



బృందగానంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్‌భారత్ శ్రేష్ఠ్‌భారత్‌లో భాగంగా ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలలోని ఏడు నుంచి 10వ తరగతికి చెందిన 12 మందితో కూడిన బాలబాలికల జట్టు అక్కడి రీజినల్ స్థాయిలో నిర్వహించిన బృందగానం పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. నవంబరు 11 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈ బృందం పాల్గొంటుందని వారు వెల్లడించారు. ఈ మేరకు విజేతలను అభినందించారు.

భార్యను హత్య చేసిన భర్త రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

న్యూస్‌టుడే, తాండూరు: భార్యను కొట్టి చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీకాంత్, ఆయన భార్య సుజాత(23) పాత తాండూరు రైల్వేగేటు సమీపంలో నివాసం ఉంటున్నారు. భార్యను అనుమానించిన శ్రీకాంత్ గురువారం రాత్రి ఆమెపై దాడి చేసి కొట్టాడు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో వెంటనే అక్కడికి వచ్చి జిల్లా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ జైలుకు..

రాయపోల్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. రాయపోల్ ఠాణాలో ఆయన వెల్లడించిన వివరాలు.. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన కోనేరు యాదగిరి మద్యానికి బానిసయ్యాడు. 15 రోజుల క్రితం మరోవ్యక్తితో కలిసి హైదరాబాద్‌లో బోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలోని బాపూజీనగర్‌లో రోడ్డుపక్కన నిలిపిన బైక్‌ను దొంగిలించి అనాజీపూర్‌లో ఓ వ్యక్తికి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈనెల 18న రాయపోల్ వైన్స్‌లో మద్యం తాగి జీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ముందు నిలిపిన స్కూటీని దొంగిలించారు. శుక్రవారం స్కూటీని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా రాయపోల్ సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా దొంగతనం కేసులు బయటపడ్డాయని సీఐ వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనకు సిద్ధమవుదాం..

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

నవంబరులో నిర్వహణకు ఆదేశాలు

భావి శాస్త్రవేత్తలను రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహిస్తోంది. వారి ఆలోచనలకు అనుగుణంగా నమూనాలను రూపొందించి ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. 2023-24కు సంబంధించి ఇన్‌స్పైర్ మనక్, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. గతేడాది వరకు ఈ రెండింటిని వేర్వేరుగా ఏర్పాటు చేయగా, ఈ సారి ఒకేసారి నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ మేరకు ప్రదర్శనలను నవంబరులో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

ఉపాధ్యాయులు దృష్టిసారించాలి..



విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం కావాలి. ఇందులో పాల్గొనేందుకు విద్యాశాఖ గుగూల్ ఫామ్‌లో నవంబరు మొదటి వారంలోపు వివరాలు నమోదు చేయాలి. అదే నెలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తాం. మరోవైపు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన వారు సైతం సిద్ధం కావాలి. గైడ్ ఉపాధ్యాయులు ఈ దిశగా దృష్టిసారించాలి.

- సిద్దారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, సంగారెడ్డి

ఇన్‌స్పైర్‌లో ఎంపికైనవే..

ఈ సారి రెండు ప్రదర్శనలు కలిపి నిర్వహిస్తున్నా.. ఇన్‌స్పైర్ మనక్‌లో మాత్రం కేవలం ఎంపిక చేసిన విద్యార్థులు మాత్రమే పాల్గొనాలి. ఇందుకు ఒక్కో విద్యార్థికి ప్రాజెక్టు తయారీ నిమిత్తం రూ.10 వేలు వారి ఖాతాలో జమచేస్తారు. అంతర్జాలంలో నమోదు చేసిన నమూనాను మాత్రమే ప్రదర్శించాలి. ఇన్‌స్పైర్ మనక్‌లో గతేడాది ఆరు నమూనాలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల నుంచి రెండు చొప్పున ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మెదక్ నుంచి ఒక్కటీ ఎంపిక కాలేదు.

నాలుగు జిల్లాల్లో ఎంపిక ఇలా..			
సంగారెడ్డి	93	సిద్దిపేట	188
మెదక్	38	వికారాబాద్	54

నిర్దేశించిన అంశాలు

ప్రధాన: సుస్థిర భవిష్యత్తుకు శాస్త్ర సాంకేతిక

ఉప అంశాలు

1. ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత
2. రవాణా కమ్యూనికేషన్
3. సహజ వ్యవసాయం
4. విపత్తుల నిర్వహణ
5. గణిత నమూనాలు, గణన ఆలోచన
6. వ్యర్థాల నిర్వహణ
7. వనరుల నిర్వహణ

14 మందికి..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జూనియర్ విభాగంలో 6-8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10 తరగతులకు అవకాశం కల్పిస్తారు. నిర్దేశించిన ప్రధానాంశంతో పాటు ఉప అంశాల్లో నమూనాలు తయారు చేయాలి. ఒక్కో పాఠశాల నుంచి 14 మంది పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు గైడ్‌గా వ్యవహరిస్తారు. మరోవైపు ఉపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ విద్యార్థులు సైతం తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించవచ్చు. ఇందుకు విద్యాశాఖకు సంబంధించిన గుగూల్ ఫామ్‌లో పూర్తి వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే లక్ష్యం



పురస్కారాలు అందుకున్న సిబ్బందితో ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం ముందుకు సాగాలని ఆర్టీసీ మెదక్ ప్రాంతీయ మేనేజర్ ప్రభులత సిబ్బందికి సూచించారు. శుక్రవారం మెదక్ ఆర్టీసీ డిపో, గ్యారేజ్‌ను పరిశీలించి డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆర్టీసీపై ఆదరణ పెరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రం, నగదు పురస్కారాలు అందజేశారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ఆరుగురు మహిళలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదలలో నిర్లక్ష్యం తగదు: భారాస



కాళేశ్వరం కాలువ వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

జగదేవపూర్, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తమ మండలానికి రావాల్సిన సాగునీరు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల భారాస నాయకులు అన్నారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం కేంద్ర పరిసరాల్లోని కాళేశ్వరం ప్రధాన కాలువను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజపేట మండలంలోని చెరువులను నింపేందుకు సాగునీటి సరఫరా కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ డీఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాజపేట భారాస మండలాధ్యక్షుడు తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు యోగేందర్ ఎంపిక

దౌల్తాబాద్: అండర్-19 విభాగంలో దౌల్తాబాద్ ప్రభుత్వ కళాశాలకు చెందిన యోగేందర్ మెదక్ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మధు శ్రీవాత్సవ తెలిపారు. బాగా రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని కోరారు.

వృత్తి శిక్షణ.. భవితకు నిచ్చెన

వరంగా మారిన విశ్వకర్మ యోజన

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం:

ఒకప్పుడు పల్లెల్లో కులవృత్తులపై ఆధారపడి అనేకమంది జీవించేవారు. ఒకరికొకరు చేదోడుగా ఉంటూ అన్ని పనులు వారే చేసుకునే వారు. యంత్రపరికరాల ఆగమనంతో పరిస్థితులు తారుమారయ్యాయి. కులవృత్తులపై ఆధారపడిన వారు చెల్లాచెదురయ్యారు. సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 'పీఎం విశ్వకర్మ యోజన'ను తీసుకొచ్చింది. దీనిద్వారా కులవృత్తులను ప్రోత్సహించి, వాటిపై ఆధారపడిన వారికి చేయూతనిచ్చేందుకు శిక్షణ ఇస్తోంది. ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగా సిద్దిపేటలో పలు కులవృత్తుల వారికి శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఏయే కులవృత్తులపై తర్ఫీదు ఇస్తున్నారనే అంశాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

వృత్తి నైపుణ్యాల పెంపుదల

జిల్లా కేంద్రంలో విశ్వకర్మ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ప్రస్తుతం స్వర్ణకారులు, వడ్రంగి, రజక, నాయీబ్రాహ్మణ కులాలకు సంబంధించిన వృత్తులపై శిక్షణ ఇస్తున్నారు. అన్ని కులాలకు కలిపి కాకుండా వేర్వేరుగా శిక్షణ ఇస్తున్నారు. ఆయా కులాలకు సంబంధించిన వృత్తి నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. స్వర్ణకారుల వృత్తికి సంబంధించి మొదటి బ్యాచ్‌కు శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 16న ప్రారంభించారు.

రోజుకు రూ.500 భత్యం

ఉమ్మడి మెదక్ జిల్లాలోని మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 41 మంది.. 25 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఈ శిక్షణ తీసుకుంటున్నారు. ఇది వారం రోజులపాటు కొనసాగింది. హాజరైన వారికి రవాణా, ఇతర భత్యం కింద రోజుకు రూ.500 చొప్పున 6 రోజులకు రూ.3వేలు ఇస్తున్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసిన వారికి ధ్రువపత్రంతో పాటు రూ.15 వేల విలువైన వృత్తి పనిముట్లు ఇస్తారు. తర్వాత బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించనున్నారు. ఈ కార్యక్రమం చాలా బాగుందని శిక్షణకు హాజరవుతున్న వారు తెలిపారు.



తర్ఫీదు పొందుతున్న స్వర్ణకారులు

ఎంతో ఉపయోగకరం

శిక్షణ బాగుంది. వివిధ రకాల బంగారు, వెండి ఆభరణాలు, వాటి తయారీలో ఉపయోగించే లోహాలు, ఇతర వస్తువులు, వాటిని తూకం వేయడం గురించి పక్కాగా నేర్పిస్తున్నారు. ఇవి మా వృత్తిపరంగా చాలా ఉపయోగపడతాయి.

-కందుకూరి అరుణాచారి, అక్కన్నపేట

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్తు సరఫరా ఉండదని విద్యుత్తు శాఖ ఏడీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కంచరిబజార్, ఎస్బీఐ బ్యాంకు, బురుజు, సుభాష్ రోడ్డు, శుభోదయ పాఠశాల, కాంటినెంటల్ ప్రాంతాల్లో, వివేకానంద నగర్, నర్సాపూర్ ఎక్స్‌రోడ్డు, శంకర్‌నగర్, వావి నగర్, నర్సాపూర్ గ్రామం, రెండు పడక గదుల ఇళ్ల సముదాయం, గుండ్లచెరువు పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఐనాపూర్‌లో క్షుద్రపూజల అనుమానం

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో ఓ మేకను నరికి పొలంలో తల, మొండెం పారవేశారు. దీనిని పొలం యజమాని గన్నెబోయిన వెంకటేశ్ శుక్రవారం ఉదయం గుర్తించారు. ఆందోళనకు గురై ఈ విషయాన్ని పోలీసులకు తెలుపడంతో వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షుద్ర పూజలు చేసినట్లుగా అక్కడ ఎలాంటి వస్తువులు కనిపించలేదు. కేవలం మేక తల, మొండెం కనిపించాయి. మూఢ నమ్మకాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్సై రాజు సూచించారు.

బకాయిలు విడుదల చేయాలంటూ ధర్నా

సిద్దిపేట టౌన్: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బోధనా రుసుంను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సలీంకు అందజేశారు.

గజ్వేల్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, బోధనా రుసుముల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి కోరెం ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గజ్వేల్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ

గజ్వేల్ గ్రామీణ, సిద్దిపేట టౌన్: ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధిని జయించవచ్చని గజ్వేల్ ఎఫ్ఎ అధ్యక్షుడు నాగమున్నయ్య అన్నారు. శుక్రవారం గజ్వేల్ బాలికల విద్యాసౌధం ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలలో, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, స్మార్ట్ లయన్స్‌క్లబ్ సంయుక్తాధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజంలో కీలక పాత్ర ఉపాధ్యాయులదే



దర్మాజీపేటలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

దుబ్బాక, న్యూస్‌టుడే: విద్యారంగ అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని పీఆర్‌టీయూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దర్మాజీపేట, తిమ్మాపూర్, హబ్షీపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు పల్లె శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

సిద్దిపేట, న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తును నిర్మించే బాధ్యత ఉపాధ్యాయులదేనని, సమాజంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో నూతన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం - విద్యా సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శశిధరశర్మ, ప్రతినిధులు పి.శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత రామస్వామి మాట్లాడారు. ప్రతినిధులు వెంకటరాజం, విజయశుభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ సాయం పెంచాలి: ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇచ్చే సాయాన్ని పెంచాలని, లక్షల్లో ఖర్చయితే వేలల్లో అందజేయడం వల్ల ఆ కుటుంబాలకు తిప్పలు తప్పడం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్ మందిరంలో శుక్రవారం చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాలకు చెందిన 64 మంది లబ్ధిదారులకు రూ.17.94 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్దప్ప, భారాస నాయకులు, పాల్గొన్నారు.

సిద్దిపేట టౌన్: పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన బగడ సంగీత అనారోగ్యానికి గురయ్యారు. ఈ మేరకు రూ.1.5లక్షల ఎల్ఓసీ మంజూరు కాగా శుక్రవారం సిద్దిపేటలో బాధితురాలి తండ్రి దిలీప్‌సింగ్‌కు అందించారు.

కేసులతో అభివృద్ధిని అడ్డుకోవద్దు: వంటేరు

గజ్వేల్, న్యూస్‌టుడే: కోర్టుల్లో కేసులు వేస్తూ కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు.. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం వర్గల్ మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయించిన భూములపై కేసులు వేసి అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. సేకరించిన దాదాపు 2వేల ఎకరాల్లో వివిధ కంపెనీలు వస్తే స్థానికులతో పాటు నిర్వాసితులకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందన్నారు. నియోజకవర్గానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఎన్జీటీలో కేసులు వేయటం సరికాదన్నారు. వెంటనే వాటిని ఉపసంహరించుకోకపోతే ఆ స్థలాల్లోనే దీక్ష చేపడతామన్నారు. ప్రతిపక్షంలో ఉండగా మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన మాట్లాడిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చినా వారి సమస్యలు ఎందుకు పరిష్కరించటం లేదు? ఎకరాకు రూ.50 లక్షలు ఇప్పిస్తామని నమ్మబలికిన నేతలు ఇప్పుడు ఎక్కడికి పోయారని ఆయన ప్రశ్నించారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.170 కోట్ల నిధులను రప్పించి పనులు చేపట్టాలన్నారు.

ధాన్యం త్వరగా తరలించాలి: అదనపు కలెక్టర్



శనిగరంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కోహెడ గ్రామీణం: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కోహెడ మండలంలోని శనిగరం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు చేశారు. ఏపీఎం తిరుపతి, సీసీ రాజమౌళి, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. కొనుగోళ్ల తీరుపై రైతులను అడిగి తెల్సుకున్నారు. తేమ 15 శాతం ఉంటేనే కేంద్రాలకు తేవాలని నిర్వాహకులు చెప్పాలని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం నందారం, మంచినీళ్లబండ, ధర్మారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను హుస్నాబాద్ సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య ప్రారంభించారు. సింగిల్‌విండో డైరెక్టర్ బండి కుమార్, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, ఏఈఓ వేల్పుల శేఖర్, సీసీలు శివచరణ్, రాజు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు: చిన్నకోడూరు, గోనెపల్లి, ఇబ్రహీంనగర్, మాచాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ఆంజనేయులు, కస్తూరిపల్లి, ఓబులాపూర్, రామునిపట్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను గంగాపూర్ పీఏసీఎస్ ఛైర్మన్ కనకరాజు ప్రారంభించారు.

ధూమపానానికి దూరంగా ఉంటేనే ఆరోగ్యం

హుస్నాబాద్ గ్రామీణం: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, దానికి యువత దూరంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పి దివ్య కోరారు. శుక్రవారం అక్కన్నపేట మండలం చాపగానితండాలో ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించారు. పొగతాగే వారితో పాటు పక్కనున్న వారిపైనా ప్రభావం చూపుతుందన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ధూమపానానికి దూరంగా ఉంటామని పాటు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏఎన్ఎం రజిత, రమాదేవి, హెల్త్ అసిస్టెంటు బాబూరావు, అనిల్, పంచాయతీ కార్యదర్శి స్వరూప పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఐకేపీ ఏపీఎంగా భిక్షపతి

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండల ఐకేపీ ఏపీఎంగా భిక్షపతిని నియమించారు. అక్కన్నపేట మండలం ఏర్పడినప్పటి నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు ఏపీఎంగా జి.శ్రీనివాస్‌గౌడ్ ఒక్కరే పనిచేశారు. ఒక్కో మండలానికి ఒక ఏపీఎం ఉండాలనే ఆలోచనతో అతన్ని అక్కన్నపేట మండలానికి పరిమితం చేశారు. అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి క్లస్టర్ సీసీగా పనిచేస్తున్న భిక్షపతికి ఏపీఎంగా శుక్రవారం అదనపు బాధ్యతలు అప్పగించారు.

పంచాయతీ కార్యాలయాలకు భవనాల పరిశీలన

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలంలో కొత్తగా ఏర్పాటు కానున్న గ్రామ పంచాయతీల్లో కార్యాలయ భవనాల కోసం శుక్రవారం అధికారులు పరిశీలన జరిపారు. మండలంలో కొత్తగా చౌటకుంటతండా, సేవాలాల్ మహారాజ్‌తండా, శ్రీరాంతండా, చౌదుతండా, దాసుతండా, హాథీరాంతండాలు కొత్త గ్రామ పంచాయతీలుగా మారనున్నాయి. వీటి ఏర్పాటుకు ఇప్పటికే గెజిట్ విడుదలైంది. దీంతో పాటు పంచాయతీ ఎన్నికలకు ఇటీవల వార్డుల వారీ ఓటర్ల జాబితా తయారీతో కొత్త పంచాయతీల్లోనూ జాబితాలు తయారు చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భవనాలు ఉన్నాయా? లేవా? తెలుసుకునేందుకు ఎంపీడీవో ప్రవీణ్ బాబు జయరాం, ఎంపీవో గుగులోతు మోహన్, ఏపీవో ప్రభాకర్ వెళ్లారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలతో పాటు ప్రైవేటు భవనాలను పరిశీలించారు. కొన్నిచోట్ల ప్రభుత్వ భవనాలు ఉన్నాయని, లేని చోట అద్దె లేకుండానే సొంత భవనాలు ఇచ్చేందుకు పలువురు ముందుకొచ్చినట్లు తెలిపారు.

మున్నూరు కాపుసంఘం యువజన అధ్యక్షుడి ఎన్నిక

చేర్యాల: మున్నూరు కాపు సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా మండలంలోని గుర్జకుంటకు చెందిన కాశెట్టి పాండు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య, రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వి.ప్రకాశ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు పాండు తెలిపారు.

వారసంతలో పశువైద్యుడిని నియమించండి



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో ప్రతీ శుక్రవారం జరిగే వార సంతలో కబేళాల కోసం కొనుగోలు చేసే పశువుల విషయంలో వెటర్నరీ డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌ను పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. నిబంధనల ప్రకారం కబేళాలకు వ్యవసాయం, పాల ఉత్పత్తికి పనికిరాని పశువులను మాత్రమే కొనుగోలు చేసి తరలించాలన్నారు. ఇందుకు వెటర్నరీ డాక్టర్ ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. వెటర్నరీ డాక్టర్ లేకపోవడంతో మంచి పశువులను కూడా తరలిస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎస్పీ నాయకులు వేల్పుల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులతో పల్లెల అభివృద్ధి

మిరుదొడ్డి: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధి హామీ నిధులు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర నాణ్యతా ప్రమాణాల పరిశీలన బృందం సభ్యుడు అబిద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వలసల నివారణతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. 'ఉపాధి' నిధులను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఏపీవో సుభాష్, టీఏలు, క్షేత్రస్థాయి సహాయకులు తదితరులున్నారు.

శ్మశాన వాటికకు స్థలం అందజేత

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దమ్మక్కపల్లి ఎస్సీ కాలనీ ప్రజలకు మూడు గుంటల భూమిని శ్మశాన వాటిక ఏర్పాటుకు గ్రామానికి చెందిన నాయకులు అనంతుల ప్రశాంత్, అనంతుల సంజయ్‌కృష్ణ వితరణ చేశారు. శుక్రవారం పలువురు ఎస్సీ కాలనీ వాసులు భూమి కావాలని కోరగా.. స్పందించిన అనంతుల ప్రశాంత్ తదితరులు భూమి ఇచ్చి తమ ఔదార్యం చాటుకున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

గజ్వేల్: ఆపదలో ఉన్నవారి ప్రాణాలను నిలిపే రక్తదానం ఎంతో గొప్పదని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సాయికిరణ్ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వైద్యులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి: టీపీటీఎఫ్

మిరుదొడ్డి: ఉద్యోగులకు నష్టం చేకూర్చే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీటీఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె, పోతారెడ్డిపేట, తాళ్లపల్లి, నగరం, రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట, తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో భోజన విరామ సమయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం ఐదు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. అక్బర్‌పేట- భూంపల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించరూ: సీపీఎం

కొండపాక గ్రామీణం: మండలంలోని వెలికట్ట నుంచి ఆరేపల్లి మీదుగా కొత్తగా బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి పేర్కొన్నారు. శుక్రవారం వెలికట్టలో సీపీఎం పార్టీ సమావేశానికి హాజరై జెండా ఎగురవేసి మాట్లాడారు. వెలికట్ట ఊరచెరువు నుంచి లీకేజీ అవుతున్న బుంగలను పూడ్చివేయాలని కోరారు. మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు.. టిప్పర్లు, జేసీబీ స్వాధీనం

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీని శుక్రవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. దౌల్తాబాద్ మండలం లింగాయపల్లితండాకు చెందిన గుగులోతు శ్రీకాంత్, బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన కొంతబోయిన వీరేష్, లింగాయపల్లికి చెందిన బానోతు సాయి, అఖిలేష్ కుమార్‌రామ్ అనే నలుగురు వ్యక్తులు కలిసి ఎలాంటి అనుమతులు లేకుండా ముద్దాపూర్ శివారు నుంచి అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారని పేర్కొన్నారు. నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు టిప్పర్లు, జేసీబీలను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు శుక్రవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా ఐదుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.8,500 జరిమానా విధించారు.

గజ్వేల్ గ్రామీణ: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 30 మందికి రూ.24 వేల జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడీషియల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక శుక్రవారం తీర్పునిచ్చారని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా 30 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు.

చరవాణుల అప్పగింత

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో కొంత మంది యువకులు పోగొట్టుకున్న చరవాణులను సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు బాధితులకు శుక్రవారం అందజేశారు. పట్టణానికి చెందిన సురేశ్, నితీష్, శ్రీకాంత్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ చరవాణులు పోగొట్టుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ సాంకేతికతతో చరవాణుల ఆచూకీ కనుగొని శుక్రవారం సీఐ వాసుదేవరావు బాధితులకు అందజేశారు.

ఆలయాల్లో చోరీ.. నిందితుల అరెస్టు

కోహెడ, న్యూస్‌టుడే: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన కోహెడలో చోటుచేసుకుంది. కోహెడ ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాలు.. సిబ్బందితో కలిసి గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. వెంకటేశ్వరపల్లికి చెందిన రేగుల శ్రీనివాస్, కోహెడకు చెందిన పెసరు పరశురాములు ద్విచక్రవాహనంపై వెళ్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకుని విచారించగా ఆలయాల్లో దొంగతనాలు చేసినట్లుగా ఒప్పుకున్నారు. చోరీ చేసిన సొమ్మును వెంకటేశ్వరపల్లికి చెందిన షేక్ ఇమామ్‌కు విక్రయించినట్లు నిందితులు తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్సై తెలిపారు.

అవసరం మేరకే చరవాణి వినియోగించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల, న్యూస్‌టుడే: బాలికలు, మహిళలు మంచి, చెడు స్పర్శలను గుర్తించి తక్షణమే స్పందించాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన చట్టాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. చరవాణి అవసరం మేరకే వినియోగించాలని, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, హుస్నాబాద్ డివిజన్ షీటీం హెడ్‌కానిస్టేబుల్ సైదయ్య, కానిస్టేబుళ్లు, అధ్యాపకులు ఉన్నారు.

ఉపకార వేతనాలు చెల్లించకపోతే పోరాటం: ఏఐఎస్ఎఫ్ఐ

సిద్దిపేట: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుము, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేదంటే పోరాటాలు తప్పవని ఏఐఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సిద్దిపేటలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 27వ తేదీలోపు బకాయిలు విడుదల చేయకపోతే చలో ఇందిరా పార్కు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి జనార్దన్, ప్రతినిధులు ఉన్నారు.

శాశ్వత ప్రాతిపదికన విధుల్లో కొనసాగించండి

సిద్దిపేట, న్యూస్‌టుడే: మున్సిపల్ సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన విధుల్లో కొనసాగించాలని, అప్పటి వరకు కనీస వేతనంగా రూ.26 వేలు అమలు చేయాలని జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తలపెట్టిన చలో హైదరాబాద్ (సీడీఎంఏ కార్యాలయానికి)కు సిద్దిపేట మున్సిపల్ కార్యాలయ సిబ్బంది వాహనాల్లో తరలారు. సంఘ నాయకులు నరసింహులు, రాజయ్య, వినోద, పద్మ, ఎల్లవ్వ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ ఆశయానికి తూట్లు!

● చెత్తకుప్పలు, మట్టిదారులతో కాలనీవాసుల అవస్థలు



మైత్రివనంలో రోడ్డు పక్కన వేసిన చెత్త



ఎస్ఆర్‌నగర్‌లో కయ్యలుగా మారిన మట్టి రోడ్డు

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్: నూతనంగా ఏర్పడిన కాలనీల్లో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. వర్షాలకు మట్టిరోడ్లు కయ్యలుగా మారడంతో అవస్థలు తప్పడం లేదు. పట్టణంలోని మైత్రివనంలో ఎక్కడ చూసినా సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ఎస్ఆర్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. కొంతమంది ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తూ స్వచ్ఛ సిద్దిపేట ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. చెత్త నిల్వతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ఆయా ప్రాంతాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్య క్రమంలో కృషి చేస్తామని తెలిపారు.